# సాక్షి కర్నూలు

శుక్రవారం | 1 | డిసెంబర్ | 2023






## శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి బృందావన దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి.



## గౌరమ్మా...కరుణించమ్మా!

ఆలూరు: గౌరమ్మ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలకు చక్కెర హారతులతో నైవేద్యం సమర్పించారు. ఆడబిడ్డలకు నూతన వస్త్రాలు సమర్పించారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బాపట్లకు చెందిన పి.సందీప్ గురువారం రూ.1,00,500 విరాళంగా అందజేశారు.

## న్యూస్‌రీల్

### ఆదోని ఏడీఏగా బాలవర్ధిరాజు

- అగ్రానమీ ఏడీఏగా ఆదోని ఏడీఏ అరుణకుమారి నియామకం



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ ఆదోని సబ్ డివిజన్ ఏడీఏగా బాలవర్ధిరాజును నియమిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో అగ్రానమీ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న ఈయనను డిప్యూటేషన్‌పై నియమించారు. ఇప్పటివరకు ఆదోనిలో ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న కె.అరుణకుమారిని డిప్యూటేషన్‌పై జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో అగ్రానమీ ఏడీఏగా నియమించారు. వీరు ఈ పోస్టుల్లో 2024 జూన్ 30 వరకు కొనసాగనున్నారు. ఆదోని ఏడీఏగా బాలవర్ధిరాజు రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

### 2న కార్తీక వన మహోత్సవం

కర్నూలు కల్చరల్: పర్యాటక, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన కార్తీక వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. గార్గేయపురం సమీపంలోని నగర వనంలో ఉదయం 10 గంటలకు కార్తీక వనభోజనాలు ఆరగిస్తూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువలా వీక్షించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా అధికారులు కుటుంబ సమేతంగా వేడుకలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

### నేటి నుంచి పింఛన్ల పండుగ

- ఉమ్మడి జిల్లాకు రూ.129.41 కోట్లు విడుదల



కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద డిసెంబర్ నెల పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఇందుకోసం అవసరమైన నగదును ప్రభుత్వం గురువారం బ్యాంకులకు విడుదల చేసింది. వెంటనే బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. కర్నూలు జిల్లాకు రూ.68,24,53, 5000, నంద్యాల జిల్లాకు రూ.61,16,48,500 ప్రకారం రూ.129,41,02,000 పంపిణీ చేయడానికి నగదు విడుదలైంది. ప్రతి నెల 1వ తేదీ వస్తుందంటే అవ్వతాతలు, వికలాంగులు ఇతర అన్ని వర్గాల వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. శనివారం ఉదయం నుంచే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పింఛనుదారులకు గుడ్ మార్నింగ్ చెప్పి నగదు అందించనున్నారు. పంపిణీ కార్యాక్రమాన్ని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షిస్తారు. 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

### జనవరి 1 నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): 2024 జనవరి 1వ తేదీ నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించేందుకు సమాయత్తం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన అంశాలపై కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైనాలో నిమోనియా వ్యాప్తి నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఇంటింటా తిరిగి వ్యాధులు ఉన్న వారి వివరాలను యాప్‌లో నమోదుచేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో రెఫర్ చేయబడ్డ రోగుల దారి ఖర్చులకు ఒక్కోజిల్లాకు రెండు కోట్ల రూపాయలను పంపినట్లు చెప్పారు. వలసలను నివారించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

### శ్రీశైలం డ్యామ్‌లో 60 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో గురువారం సాయంత్రానికి 59.8658 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ పరివాహక ప్రాంతమైన సుంకేసుల జలాశయం నుంచి 2,687 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. బుధవారం నుంచి గురువారం వరకు శ్రీశైలం నుంచి ఎగువ ప్రాంతాలకు 3,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 0.079 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 155 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలప్రవంతికి 1013 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 245 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం 838.70 అడుగులకు చేరుకుంది.

# అద్భుతం.. అద్వితీయం

- అవుకు రెండో టన్నెల్ ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- సీమ వాసుల చిరకాల వాంఛ సాకారం
- అట్టహాసంగా సాగిన కార్యక్రమం
- సీఎంకు ఘన స్వాగతం పలికిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మొన్నటి అసాధ్యం.. నిన్నటి కల.. నేడు సాకారం. గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్‌లో భాగమైన అవుకు టన్నెల్ నిర్మాణంతో ఇది వాస్తవమైంది. పాలకుల సంకల్పం.. ఇంజినీరింగ్ నిపుణుల మేధస్సు.. కార్మికుల శ్రమ వెరసి.. సీమకు జలహారం వేసేందుకు కృష్ణమ్మ పరుగులు తీసింది. ఎర్రమల కొండ గర్భంలో నుంచి కృష్ణా జలాలు అవుకు రిజర్వాయర్‌కు చేరుతున్న దృశ్యాలు అద్భుతం. కరువు నేల దాహార్తి తీర్చి బీడు భూములను సస్యశ్యామలం చేయాలనుకున్న మహానేత వైఎస్సార్ ఆశయాన్ని ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చడం అద్వితీయం.



సీఎంను ఆశీర్వదిస్తున్న అర్చకులు



అవుకు టన్నెల్‌లోకి ప్రవేశిస్తున్న కృష్ణా జలాలు



అవుకు టన్నెల్ వ్యూ పాయింట్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: కరువు నేలకు జలాభిషేకం చేసేలా.. బీడు భూములు సస్యశ్యామం అయ్యేలా.. సీమ రైతు జీవితాల్లో వెలుగులు నింపేలా కృష్ణమ్మ వడివడిగా సొరంగ మార్గాల్లో అవుకు రిజర్వాయర్ చేరుకున్న వేళ ఎర్రమల కొండలు పులకించాయి. సాగు నీటి కష్టాలు తొలగేలా రైతుల దశాబ్దాల కల సాకారమైంది. రాయలసీమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ గాలేరు నగరి సుజల స్రవంతిలో భాగంగా నిర్మించిన అవుకు రెండో టన్నెల్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో సీమ వాసులు ఆనందోత్సాహంలో మునిగితేలారు. జై జగన్... జోహార్ వైఎస్సార్ అంటూ నినదించారు. అవుకు పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో ఉదయం 11.40 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ కర్నూలు కలెక్టర్ సృజన, జేసీ ఎస్. మౌర్య, ఎంపీ సంజీవ్‌కుమార్, డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కంగాటి శ్రీదేవి, హఫీజ్ ఖాన్, చెన్నకేశవరెడ్డి, జెడ్పీ పాపిరెడ్డి, ఎంపీ సంజీవ్‌కుమార్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులతో ఆప్యాయంగా మాట్లాడిన సీఎం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో అవుకు మండలం మెట్టుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు 12.20 గంటలకు చేరుకున్నారు.

### జిల్లా నాయకుల స్వాగతం

హెలిపాడ్ వద్దకు చేరుకున్న వైఎస్ జగన్‌కు నేతల నుంచి ఘన స్వాగతం లభించింది. నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, బిజేంద్రనాథ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కాన్వాయ్‌లో సీఎం వైఎస్ జగన్ అవుకు టన్నెల్ ప్రాంతానికి చేరుకున్నారు.

### ఫొటో ఎగ్జిబిషన్ తిలకించి.. పైలాన్‌ను ఆవిష్కరించి..

అవుకు టన్నెల్ ప్రాంతానికి 12.50 గంటలకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్ అక్కడ ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌కు చేరుకుని టన్నెల్ నిర్మాణాన్ని వీక్షించారు. వేద పండితుల ఆశీర్వాదం అనంతరం, మంత్రోచ్చారణల మధ్య రెండో టన్నెల్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం కాన్వాయ్‌లో హెలిపాడ్ వద్దకు చేరుకున్న సీఎం ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సీఎం వైఎస్ జగన్ హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. తన కోసం ఎదురుచూస్తున్న జనాలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మధ్యాహ్నం 1.50 గంటలకు హెలికాప్టర్‌లో కడప విమానాశ్రయానికి బయలుదేరారు. జిల్లా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు సీఎం జగన్‌కు వీడ్కోలు పలికారు.

### అనారోగ్య బాధితులకు భరోసా..

టన్నెల్ ప్రారంభ అనంతరం హెలిపాడ్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఇద్దరు అనారోగ్య బాధితులు సీఎం వైఎస్ జగన్‌ను కలిసి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతపురం జిల్లా నార్పల మండలానికి చెందిన నారా పుల్లారెడ్డి, అవుకు మండలం గోకులదిన్నెకు చెందిన 20 నెలల చిన్నారి హర్షిత తల్లిదండ్రులు గుర్రప్ప, సౌమ్య సీఎంను కలిసి తమ సమస్యను వివరించారు. తక్షణం స్పందించిన సీఎం జగన్ కిడ్నీ చికిత్స కోసం పుల్లారెడ్డికి రూ.5 లక్షలు, హర్షిత చికిత్సకు రూ. లక్ష అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం తిరుగు ప్రయాణం కాక ముందే బాధితులకు కలెక్టర్ చెక్కులను అందజేశారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు హెలిపాడ్ వద్దకు తరలివచ్చిన జనం

# గృహయజ్ఞం.. వేగవంతం

- జనవరి 31 నాటికి 15 వేల గృహ నిర్మాణాలు పూర్తి
- మెగా కంప్లీషన్ డ్రైవ్‌లో భాగంగా దిశా నిర్దేశం
- అవసరాలకు అనుగుణంగా సిమెంట్, స్టీల్, ఇసుక నిల్వలు
- ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు అడ్వాన్స్‌గా రూ.14 కోట్లు
- ఇప్పటికే రూ.422.05 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం



ఆదోని అర్బన్‌లో కొనసాగుతున్న గృహ నిర్మాణాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఇచ్చిన లక్ష్యం మేరకు జిల్లాలో 2024 జనవరి 31వ తేదిలోగా (రెండు నెలలు) 15,491 గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఇచ్చిన లక్ష్యాన్ని 60 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నా, 45 రోజుల్లోనే లక్ష్యం చేరుకోవాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను ( ఆప్షన్ 1,2 3 ) వేగవంతం చేసే ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో అవసరమైన మెటీరియల్‌ను అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలోని 34 గోడౌన్లలో గృహ నిర్మాణాల అవసరాలకు సంబంధించి సిమెంట్, స్టీల్, ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఇక మిగిలిన ఇటుకలు, సెంట్రింగ్ మెటీరియల్ సమకూర్చుకునేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఎన్ని ఇటుకల బట్టీలు ఉన్నాయి? సెంట్రింగ్ మెటీరియల్ ఎంత ఉంది ? అనే వివరాలపై సమగ్ర నివేదికలు పంపాలని ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని ఈఈ, డీఈఈ, ఏఈలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఈ నెల 1న మండల స్థాయిల్లోను, 5,6 తేదిల్లో సచివాలయాల పరిధిలోను ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారి వారి పరిధిలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు ఇటుకలు, సెంట్రింగ్ మెటీరియల్ సమకూర్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారుల నిర్ణయం మేరకు సిమెంట్ బ్రిక్స్, ఎర్ర ఇటుకలను అందించేందుకు కూడా సమాచారం తీసుకుంటున్నారు.

### ఇప్పటికే 15,903 గృహ నిర్మాణాలు పూర్తి

జిల్లాలోని 344 జగనన్న కాలనీల్లో మొత్తం 40,815 గృహాలు మంజూరు కాగా, ఇందులో లేఅవుట్లలో 21,477, సొంత స్థలాల్లో 19,338 గృహాలను నిర్మిస్తున్నారు. వేర్వేరు కారణాలతో 430 గృహాలు నాట్ స్టార్టెట్ కింద ఉండగా, బీబీఎల్‌లో 8,335, బీఎల్‌లో 11,942, ఆర్ఎల్ దశలో 2,385, ఆర్‌సీ దశలో 1820 గృహ నిర్మాణాలు కొనసాగుతుండగా, 15,903 గృహాలు పూర్తి అయ్యాయి. ఈ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.422.05 కోట్లను ( మెటీరియల్ మొత్తంతో కలిపి ) లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ఇప్పటి వరకు పూర్తి అయిన 15,903 గృహ నిర్మాణాలను మినహాయించి జనవరి 31లోగా వేర్వేరు దశల్లో ఉన్న 15,491 గృహాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరితే జిల్లాలో దాదాపు 31 వేలకు పైగా గృహ నిర్మాణాలు పూర్తి కానున్నాయి.

### స్వయం సహాయక సంఘాలకు రూ.83.23 కోట్లు

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు మొత్తం 23,781 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం రూ.83.23 కోట్లను రుణంగా అందించారు. గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు ఈ మొత్తం కూడా వారికి అందడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు కూడా గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు. అలాగే గృహాలు నిర్మించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 7 వేల మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల ప్రకారం మొత్తం రూ.14 కోట్లను అడ్వాన్స్‌గా అందించారు.

| గోడౌన్లలో ఉన్న నిల్వలు |
| --- |
| సిమెంట్: 3,363 టన్నులు |
| స్టీల్: 1,200 టన్నులు |
| ఇసుక: 21,068 టన్నులు |

### లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ




మెగా కంప్లీషన్ డ్రైవ్‌లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు జనవరి 31వ తేది నాటికి 15 వేల గృహాలను పూర్తి చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. మా శాఖకు చెందిన ఈఈ, డీఈఈ, ఏఈలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నాం. ఎంపీడీఓ, మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకొని లక్ష్యాన్ని సాధిస్తాం. క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ముఖ్యంగా 1,2 ఆప్షన్లతో పాటు 3వ ఆప్షన్ కింద చేపడుతున్న గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేస్తాం. – ఎం. సిద్ధలింగమూర్తి, హౌసింగ్ పీడీ

### పారదర్శకంగా తుది ఓటరు జాబితా

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించి తుది ఓటరు జాబితాకు పారదర్శకంగా రూపొందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ప్రస్తుతం ఒక్కో దరఖాస్తు 30 నుంచి 45 రోజుల మధ్య పెండింగ్‌లో ఉంటున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఇంజినీర్లతో పలు అంశాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రీసర్వేకు సంబంధించి డిసెంబర్ నాటికి ఫైనల్ ఆర్‌ఓఆర్‌ను పబ్లిష్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న 15,891 ఇళ్లను 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి అన్ని సచివాలయాల్లో వంద శాతం రిజిస్ట్రేషన్‌లు కావాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. మూడో విడత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నాటడానికి 57వేల నంబర్ రాళ్లు వచ్చాయని, వీటిలో ఇప్పటి వరకు 11 వేలను రాళ్లను నాటినట్లు చెప్పారు. టెలీకాన్ఫరెన్స్‌లో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాద్, రామలక్ష్మీ, హౌసింగ్‌పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.




### ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

పోలియో సోకడంతో పుట్టుక నుంచి నాకు రెండు కాళ్లు వంకరగా ఉన్నాయి. నాకు నలుగురు సంతానం. నేను, నా భార్య గ్రామాలకు వెళ్లి ఫినాయిల్ అమ్మి జీవనం సాగిస్తున్నాం. టీడీపీ హయాంలో సదరం సర్టిఫికెట్ ఎలా పొందాలో తెలియక ఇబ్బంది పడ్డాను. రెండు సార్లు కర్నూలు జిల్లా ఆస్పత్రికి వెళ్లినా లాభం లేకపోయింది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోయనగర్‌లోని సచివాలయంలో సదర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. 15 రోజుల్లోనే మా ఆలూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేయడంతో అక్కడి వెళ్లి పరీక్షలు చేయించుకున్నా. పది రోజుల తర్వాత నాకు సదరం సర్టిఫికెట్ వచ్చింది. దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరు చేశారు. ప్రతి నెలా వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి నాకు రూ.3 వేల పింఛన్ నగదు అందిస్తున్నాడు. కుటుంబ పోషణలో ఆర్థిక భారం తగ్గింది. మా కుంటుంబానికి ఆర్థికంగా తోడు నిలిచిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటుంది.

– ఈరన్న, కోయనగర్, ఆలూరు



### సొంతింటి కల నెరవేరుతోంది



నేను, నాభర్త కూలి పనులు చేసుకుని జీవనం చేస్తున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. మాకు సొంతిల్లు లేదు. అత్త వాళ్ల ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం మాకు స్థలం ఇచ్చి, ఇల్లు కూడా మంజూరు చేసింది. ఆర్థిక స్థోమతలేని మాకు సాయం చేసింది. సొంతింటి కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా కుతూరు జయశ్రీకి అమ్మఒడి పథకం కింద డబ్బులు వస్తున్నాయి. వచ్చిన డబ్బులను వృథా చేయకుండా పిల్లల ఫీజులు చెల్లిస్తున్నాం. మా కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మరువలేం.

– మహేశ్వరి, ఇందిరానగర్, ఆదోని




## క్లుప్తంగా

### నేటి సాయంత్రంలోగా ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలు పంపండి

కర్నూలు(అగ్రికల్చర్): కరువు మండలాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరుకు జాబితాలను నేటి సాయంత్రంలోగా పంపాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ఆయన గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023–24 రబీ పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. యాప్‌లో మండలాల వారీగా సాధారణ సాగు వివరాలను నమోదు చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు శాంపుల్స్ ఫెయిల్ అయితే వెంటనే సంబంధిత కంపెనీలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా నాపరాయి తరలిస్తున్న లారీ సీజ్


సీజ్ చేసిన లారీ

కర్నూలు (న్యూ టౌన్): అక్రమంగా నాపరాయి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బేతంచెర్ల నుంచి మహారాష్ట్రకు ఎంహెచ్ 16సీడీ 8101 లారీలో అక్రమంగా నాపరాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కె. నాగలాపురం దాడి చేశామన్నారు. లారీని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. అక్రమంగా మైనింగ్ తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాంని హెచ్చరించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

● 3వ తేదీ వరకు నిర్వహణ

కర్నూలు(టౌన్): నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఈ నెల 1, 2, 3 తేదీల్లో క్రెడాయ్ (కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ కర్నూలు చాప్టర్ చైర్మన్ సోమిశెట్టి వెంకట్రామయ్య, కన్వీనర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో రియల్ ఎస్టేట్ రంగ సంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. స్థలాల కొనుగోలుకు సంబంధించి రుణ సదుపాయం అందించేందుకు బ్యాంకులు ఈ ప్రాపర్టీ ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. వినియోగదారులకు కావలసిన ఇల్లు, ఇంటి స్థలం, వాణిజ్య ఆస్తిని ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కేవలం ఆస్తుల కొనుగోలు వ్యవహారాలు మాత్రమే కాకుండా ప్రత్యేక ఆకర్షణగా ఆటో ఎక్స్‌పోను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు నచ్చిన కారు, ద్విచక్ర వాహనం కొనుగోలు చేయవచ్చని, అలాగే సులభమైన వాయిదా పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని, బహుమతులు గెలుపొందే అవకాశం ఉందన్నారు.

# కూలిన బతుకులు

● నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు మహిళలు మృతి
● ముగ్గురికి గాయాలు
● రేవనూరులో విషాదం



వెంకటసుబ్బమ్మ , కుమారి(ఫైల్)


బోల్తాపడిన నూర్పిడి యంత్రం

కోవెలకుంట్ల: రెక్కాడితే డొక్కాడని కూలీలు వారు.. కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రేవనూరు గ్రామానికి చెందిన కూలీలు గురువారం ఉదయం కలుగొట్ల గ్రామానికి చెందిన రైతు పొలంలో మినుము పంట నూర్పిడికి వెళ్లారు. పనులు ముగించుకుని నూర్పిడి యంత్రంలో ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ రేవనూరు గ్రామ సమీపంలో యంత్రం బోల్తా పడింది. ఈ ఘటనలో వడ్డె వెంకటసుబ్బమ్మ(50), పగిడేల కుమారి(30) అక్కడికక్కడే మృతి చెందారు. సుబ్బమ్మ, నర్సమ్మ, జహినాబీ అనే మహిళలు స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెంకటసుబ్బమ్మకు కుమార్తె రాజ్యలక్ష్మి, కుమారుడు వీరేంద్ర ఉన్నారు. కుమార్తెకు 12 సంవత్సరాల క్రితం వివాహం కాగా కుమారుడు నంద్యాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈమె భర్త వెంకటేశ్వర్లు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పగిడేల కుమారికి తొమ్మిది సంవత్సరాల కుమార్తె వనజ, నాలుగు సంవత్సరాల కుమారుడు లక్ష్మి నరసింహ ఉన్నారు. ఈమె భర్త పగిడేల రాముడు కూడా కూలీ పనులు చేస్తున్నాడు. మొదటి భార్య బాలమ్మ 12 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రకాశం జిల్లాకు గిద్దలూరు మండలానికి చెందిన కుమారిని ఆయన పదేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృత్యువాత పడటంతో రేవనూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే కోవెలకుంట్ల సీఐ రామానుజులు, రేవనూరు, సంజామల ఎస్‌ఐలు కల్పన, ప్రతాప్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కల్పన తెలిపారు.

# ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదు

● జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. అవుకు టన్నెల్ టీడీపీ హయాంలోనే పూర్తి చేశామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గురువారం సాయంత్రం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ అవుకు టన్నెల్ గురించి మాజీ ఎమ్మెల్యే బీసీతో పాటు చంద్రబాబుకు ఏ మాత్రం అవగాహన లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని పనులు పూర్తి చేసి టన్నెల్ ప్రారంభోత్సవం చేస్తుంటే ఈ ప్రాంత వాసిగా అభినందించాల్సింది పోయి రైతులు, ప్రజలను తప్పుదోవ పట్టించేలా అవాస్తవాలు చెప్పడం తగదన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో అవుకు టన్నెల్ కోసం ఏం చేశారో అందరికీ తెలుసన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రాయలసీమను సశ్యశామలం చేసేందుకు ముందు చూపుతో ప్రాజెక్టులు నిర్మించారన్నారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులపై దృష్టి సారించి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. గోరుకల్లు ద్వారా అవుకు టన్నెల్‌కు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రెండో టన్నెల్ పనులు పూర్తి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 2014–19 మధ్య కాలంలో బీసీ ఎమ్మెల్యేగా చంద్రబాబు సీఎం ఉన్నారని ఆ సమయంలో గోరుకల్లులో 10 టీఎంసీలు ఎప్పుడైనా నింపారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరుసగా మూడేళ్ల పాటు రికార్డు స్థాయిలో 4టీఎంసీల నీళ్లు నిల్వ చేసి రైతాంగాన్ని ఆదుకునేలా చేశారన్నారు. మూడో టన్నెల్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని, అది పూర్తయితే 30 వేల క్యూసెక్కుల నీటి సరఫరా జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ పని గట్టుకొని విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి,నాయకులు కామిని తిమ్మారెడ్డి, అంబటి రామ్మోహన్‌రెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేశ్వ రెడ్డి, బాబూజీ, శేషఫణి స్వామి,సుబ్బయ్య,టీసీ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం


స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉచిత సామూహిక సేవలలో భాగంగా శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సామూహిక సేవల్లో భాగంగా చంద్రావతి కల్యాణ మండపంలో ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యాపక ఎం. పూర్ణానందం, అర్చకస్వాములు, సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.హరిదాసు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని, మహాగణపతి పూజ నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. సేవాకర్తలకు రెండు లడ్డూ ప్రసాదాలు, కైలాసకంకణాలు అందజేశారు. కాగా ఈ సామూహిక కల్యాణోత్సవంలో స్థానికులే కాకుండ మార్కాపురం, చిత్తూరు, గుంటూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో 'అట్రాసిటీ' పోర్టల్

నంద్యాల(అర్బన్): అట్రాసిటీ చట్టం నిబంధనల అమలుకు సంబంధించి ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ఏపీ ప్రభుత్వం రూపొందించిందని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారిణి చింతామణి తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. అఘాయిత్యానికి గురైన బాధితులు ఎక్కడినుండైనా ఈ వెబ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు స్వభావం ఆధారంగా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం వెళ్లిపోతుందన్నారు. ఈపోర్టల్‌లో ఎఫ్‌ఐఆర్ కాపీతో పాటు చార్జిషీట్ వివరాలను బాధితులు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు వారి లాగిన్ ద్వారా పోర్టల్‌లోని స్టేటస్‌ను అప్‌డేట్ చేస్తూ ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత బాధితులకు మొబైల్ నంబరుకు సందేశం వస్తుందన్నారు. ఆధార్, మొబైల్ నంబర్ వినియోగించి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు ఈ వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు స్టేటస్‌ను తెలుసుకోవచ్చన్నారు.

# కనకదాసు కీర్తనలు ప్రపంచానికి ఆదర్శం



మాట్లాడుతున్న ఎంపీ సంజీవకుమార్

కనకదాసు విగ్రహం వద్ద ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

కర్నూలు(అర్బన్): భక్త కనకదాసు కీర్తనలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం భక్త కనకదాసు జయంతి కార్యక్రమాలను స్థానిక సీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా భక్త కనకదాసు విగ్రహానికి కర్నూలు ఎంపీతోపాటు కోడుమూరు ఎమ్మెల్యే డా.జె సుధాకర్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, డీఆర్‌ఓ కే మధుసూదన్, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికంగా ఉన్న కురువలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. మదాసి/ మదారి కురువ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించానన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డా.జె సుధాకర్ మాట్లాడుతూ భక్త కనకదాసు కీర్తనలతో ప్రజల్లో మార్పు సాధ్యమైందన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. భక్త కనకదాసు సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీసీ వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, వివిధ బీసీ, కురువ సంఘాల నాయకులు గడ్డం రామకృష్ణ, నక్కలమిట్ట శ్రీనివాసులు, నాగరాజు, కే రామకృష్ణ, మురళీమోహన్, దేవేంద్రప్ప, వెంకటరాముడు, బత్తుల లక్ష్మీకాంతయ్య, మోహన్, ఎంకే రంగ స్వామి, శ్రీనివాసరావు, తిరుమలేష్, నాగేష్, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి బలవన్మరణం


మృతి చెందిన వినోద్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని పూర్ణానందస్వామి ఆశ్రమం సమీపంలో గొట్టిముక్కుల వినోద్ ఉరఫ్ జాన్(22) అనే యువకుడు గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ ఎస్‌ఐ గంగయ్య యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైల దేవస్థానంలోని ఓ ప్రైవేట్ సెక్యూరిటీలో వినోద్ పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తల్లి దండ్రులు పనులకు వెళ్లగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం వినోద్ తల్లి కూలి పనుల నుంచి ఇంటికి రాగా ఎంతకూ తలుపు తెరవలేదు. కిటికీ ఊచలు తొలగించి లోపలికి వెళ్లి చూడగా వినోద్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వినోద్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

# కోసిగిలో యువకుడి దారుణహత్య

● డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో దర్యాప్తు


నాగరాజు (ఫైల్)


నాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తున్న యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. గురువారం ఉదయం కోసిగిలో ఈ ఘటన చోటుచేసుకుంది. హతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లదాకుల నాగరాజు (24) అనే యువకుడు కోసిగిలోని గాంధీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య చిట్టి, తల్లి నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కోసిగిలోని శ్రీ లక్ష్మీ నరసింహ ట్రేడర్స్‌లో హమాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం వేకువ జామున బహిర్భూమికి వెళ్లేందుకు బైక్ పై డి.బెళగల్ రోడ్డులోని సినిమా టాకీస్ వెనుక భాగంలో వెళ్లాడు. బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కాపు కాచి వేటకొడవళ్లతో తల, మెడ భాగంలో నరికి అతి కిరాతంగా చంపేశారు. సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సీఐ ఎరిసా వలి, కోసిగి ఎస్‌ఐ సతీష్‌కుమార్, మరో ఇద్దరు ఎస్‌ఐలు ఘటన స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించారు. డాగ్ స్క్వాడ్ హత్య జరిగిన ప్రాంతం నుంచి కొంత దూరం బహిర్భూమి ప్రాంతం వైపు వెళ్లి.. మరలా ప్రధాన రోడ్డుకు వెళ్లి.. హత్య జరిగిన ప్రాంతానికి వచ్చి చేరుకుంది. నాగరాజుకు ఎవరితో ఎలాంటి గొడవ లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. హత్య జరిగిన ప్రాంతంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించి, హతుని భార్య, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామన్నారు.

# ఇటుకతో దాడి.. పెయింటర్ మృతి


మృతిచెందిన ప్రభాకర్

కర్నూలు: ఇటుకతో దాడి చేయడంతో కల్లూరు మండలం ఉలిందకొండ ఎస్సీ కాలనీకి చెందిన మల్లెపోగు ప్రభాకర్ (48) మృతి చెందాడు. ఈయన భార్యాపిల్లలను వదిలి కొంతకాలంగా కర్నూలు బి.క్యాంప్‌లోని పాడుబడిన క్వార్టర్స్‌లో నివాసముంటూ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి బిర్లా గేట్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇటుకతో తలపై కొట్టి అక్కడి నుంచి సైకిల్‌పై పారిపోయాడు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రం చిన్నంబావి మండలం వెలుగొండ గ్రామానికి చెందిన సూర్య చంద్రశేఖర్ ఆ మార్గం గుండా వెళ్తూ దాడిలో గాయపడిన ప్రభాకర్ సొమ్మసిల్లి రోడ్డుపై పడివుండటంతో గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని ప్రభాకర్‌ను వైద్యచికిత్సల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గురువారం ప్రత్యక్ష సాక్షి సూర్య చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి సంఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ కేంద్రంలో భద్రపరచినట్లు తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
Society for Social Transformation, NGO Wanted Counsellors/ Trainers for its CFL Project of DEAF-RBI and Canara Bank & UBI at Alur, Kosigi, Adoni, Yemmiganur, Kurnool, Koilakunta, Sirivella Mandal HQs of Kurnool & Nandyal Districts. Locals and nearby Mandal candidates only need to apply.
Salary is Rs.17,000 pm including travel.
Degree with Computer Knowledge and Training experience required. Selected Trainer needs to mobilise women/youth/farmers etc. & Conduct Trainings and liaison with Banks & Government offices.
Send your CV to sstcfldckurnool@gmail.com by 8th December 2023.
Shortlisted candidates will be called for interview. Don't believe mediators.
V.Anjaneyulu, Project Director, SST NGO
Contact District Coordinator: 95810 93519

## రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన మురళి (ఫైల్)

డోన్ రూరల్: పట్టణంలోని స్థానిక కర్నూలు రైల్వే గేట్ వద్ద ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. డోన్ పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన చాకలి మురళి(42) కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య రాధిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో తన సొంత పనిమీద రైల్వే గేటు మీదుగా వెళ్తుండగా.. అప్పుడే రైలు వస్తుండటంతో గేట్లు వేశారు. ఆ సమయంలో మురళి బైక్‌ను నిలిపి మూత విసర్జనకు ట్రాక్ పక్కకు వెళ్లగా వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మేనేజర్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం


ఏపీజీబీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్మన్ రాకేష్ కశ్యప్

బేతంచెర్ల: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలు అందిస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్, రీజనల్ మేనేజర్ నవీన్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని కొత్త బస్టాండు సమీపాన ఏపీజీబీ నూతన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. నంద్యాల రీజియన్ పరిధిలో వ్యవసాయ, విద్య, వ్యాపార, గృహ సంబంధ రుణాలు రూ.6.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రగతి కుబేర స్కీంలో డిపాజిట్ చేసుకుంటే ఎక్కువ వడ్డీ వస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రమేష్ బాబు, మేనేజర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


# ఆరోగ్యశ్రీ వివరాలు చెప్పాలంటూ మోసం

● బ్యాంకు ఖాతాలో రూ.17వేల నగదు మాయం


కర్నూలు(హాస్పిటల్): తాను ఆరోగ్యశ్రీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని, మీ అమ్మగారి ఆపరేషన్‌కు సంబంధించి వివరాలు చెప్పాలంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి బాధితురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ.17వేలు ఆన్‌లైన్ ద్వారా తస్కరించాడు. కర్నూలులోని బుధవారపేటకు చెందిన శశికళ నవంబర్ 13న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కడుపునొప్పితో చేరారు. ఆమెకు 15న వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా హెర్నియా ఆపరేషన్ నిర్వహించారు. 20వ తేదిన ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అదే సమయంలో ఓ అపరిచిత వ్యక్తి శశికళ కూతురు శ్వేతకు ఫోన్ చేశాడు. తాను ఆరోగ్యశ్రీ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నానని మాట్లాడుతూ శశికళ వివరాలు చెప్పారు. ఆమె ఆసుపత్రిలో చేరిన తేది, చేసిన ఆపరేషన్, డిశ్చార్జ్ అయిన రోజు వివరించి చెప్పేసరికి ఆమె పూర్తిగా నమ్మింది. మాటల్లో ఉంచి మీకు ఆరోగ్యశ్రీ నుంచి రూ.1,700 జమ అవుతాయని చెబుతూ ఓటీపీ వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిసేపటికే శ్వేత బ్యాంకు ఖాతా నుంచి రూ.17,885 డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో తాను మోసపోయినట్లు ఆమె గ్రహించింది. ఈ మేరకు ఆమె స్థానిక మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# లింగేశ్వర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి

● ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్


ధర్నా చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: నారాయణ కాలేజ్ కోర్ డీన్ లింగేశ్వర్ రెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘాల ఆధ్వర్యంలో గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాపిర్ బాషా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచిలి మాట్లాడారు. నారాయణ విద్యాలయాలను కామనిలయాలుగా మార్చిన లింగేశ్వర్‌రెడ్డిని డీన్ పదవి నుంచి వెంటనే తప్పించాలన్నారు. లింగేశ్వర్‌రెడ్డి రాసలీలలపై జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ధర్నాలో మహిళా సమాఖ్య నాయకులు అమీనాబీ, రేణుకమ్మ, సువర్ణ, రత్నమ్మ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిస్వామి, అశోక్, రవికుమార్, శివరాజు, ఏఐవైఎఫ్ నాయకులు చంటి, రాజశేఖర్, శివ, మహేష్, రాంబాబు, షేక్ మహబూబ్, చాందు, డీహెచ్ పీఎస్ నగర కార్యదర్శి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

| పంట | తక్కువ ధర | ఎక్కువ ధర |
|---|---|---|
| వేరుశెనగ | రూ. 4717 | రూ. 7892 |
| పొద్దుతిరుగుడు | రూ. 4069 | రూ. 4319 |
| ఆముదం | రూ. 4280 | రూ. 5539 |
| వాము | రూ. 10110 | రూ. 10110 |
| ఉల్లి | రూ. 301 | రూ. 3851 |
| ఎండుమిర్చి | రూ. 3099 | రూ. 18921 |
| శనగలు | రూ. 5689 | రూ. 5721 |
| కందులు | రూ. 7590 | రూ. 7590 |
| మొక్కజొన్న | రూ. 1639 | రూ. 2109 |
| మినుములు | రూ. 2505 | రూ. 8105 |
| కొర్రలు | రూ. 4000 | రూ. 4000 |
| సోయాచిక్కుడు | రూ. 1011 | రూ. 3805 |

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ REGULAR/DISTANCE/DISCONTINUED/FAILURE S/ DETAINED STUDENTS: ANIMAL HUSBANDRY (DIPLOMA VETERINARY) 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD. Cell: 86861 72989 [L-798949]

SSC(GD), రైల్వే, ఆర్మీ, ఉద్యోగాలు
■ 10thపాస్‌తో CRPF, CISF, BSF ఉద్యోగాలు, రైల్వే గ్రూప్-డి, రైల్వే పోలీస్ RPF, ఆర్మీ ఉద్యోగాలకు జాబ్ గ్యారెంటీతో శిక్షణ. స్వల్ప ఫీజు, ఉచిత బుక్స్, హాస్టల్, గ్రౌండ్. సిద్ధార్థ అకాడమీ, నంద్యాల. 90103 63553 [L-781168]

సెంట్రల్ పోలీస్ (SSC-GD)
■ యువతి, యువకులకు 26,146 CRPF, CISF, BSF, ITBP, SSB కానిస్టేబుల్ ఉద్యోగాలు కలవు. అ:10thపాస్, వ:18-28 (28సం॥ అనుభవం-గత ఫలితాలు గల సంస్థ) స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్: 8790844959. [L-806252]

SPOT ADMISSIONS
■ B.Sc. (Nursing), B-ఫార్మసీ, B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ) ఫార్మా-D కోర్స్‌లకి తక్కువ ఫీజుతో Management సీట్స్ (స్పాట్ అడ్మిషన్) కోసం. సంప్ర: జి. మురళి, 9030661651, ATP. [A-2769]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

REAL ESTATE
PLOT FOR SALE
■ నెలసరి కంతులతో కర్నూలు - నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్రదించండి: 99638 00314 [L-781165]
■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) సెంటు 1.20 లక్షలు. ప్లాటు కేవలం 3.30 లక్షలు మాత్రమే. నితిక డెవలపర్స్. 98884 24222 ఏజెంట్లు కావలెను. [L-806253]

SERVICES
BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్నూలు, ✆ 9311685170. [T-1258784]

WANTED
■ కర్నూలులో ధనలక్ష్మి సీడ్స్ ప్రైవేట్ లి॥, నందు అకౌంటెంట్‌గా పని చేయుటకు 5 సం॥ల అనుభవం గల స్త్రీ/పు కావలెను. M.S.Office, Tally వచ్చిన వారికి ప్రాధాన్యత. సంప్ర: 86885 43359. [L-781171]

■ కర్నూలు, కోడుమూరు నందు గల ప్రముఖ L.P.G.గ్యాస్ ఏజెన్సీ నందు పని చేయుటకు సర్వే ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 8639909853,7893829603. [L-781169]
■ J.M. కంప్యూటర్స్ నందు పని చేయుటకు 5 సం॥ల అనుభవం గల కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్ & మార్కెటింగ్ పర్సన్ (అర్హత: డిగ్రీ, ఆపైన) కావలెను. షాప్.నెం:1, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్స్, Opp: క్రేజీ బాయ్స్, కర్నూలు. సెల్: 98490 41008. [L-781170]
■ VANలో వెళ్ళి డోర్ TO డోర్ మార్కెటింగ్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత:7th to ఇంటర్ P/F. జీతం:10వేలు. ప్రమోషన్‌లో 20వేలు. కర్నూలు. సంప్రదించండి.9701969594. [L-806254]
■ Wanted FMCG Marketing Executives and Distributors for Kurnool, Kadapa & Chittoor Districts. Age 35 years Minimum 5 years experience in relevant field. Interested candidates send their CV's to gmd. gmdplatp@gmail.com. AMP Sharma ASM ph- 9440586980. RMK Reddy-9640833340. Note - send CV's than contact you personnelly. [A-1394]
■ శ్రీ వెంకటేశ డిస్ట్రిబ్యూటర్స్ BPCL MAK లూబ్రికెంట్స్ నందు ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న మాకు సేల్స్ రిప్రజెంటేటివ్స్ కావలెను. Salary upto 15000/- pm (DA+TA). కాంటాక్ట్- 9177190886 [WB-37908]

■ యర్రగుంట్లలో గల ప్రముఖ సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేయుటకు Sr. సెక్యూరిటీ గార్డు కావలెను. Qly: 10th P & above, Age: 25-45 సం, Exp. Any, ✆ 90103 26387, 92463 25282. [B-190867]
■ కష్టలైన్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి,స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15,000/--40,000/- ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-912]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9640258899/ 9640468899 [H-793657]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221881]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫ్యాషన్





వివాహ వేడుకలలో కట్టే చీరలే దివ్యంగా వెలిగిపోతుంటాయి.
ఇక వాటికి అదనంగా మరో స్టయిల్‌ను కూడా జోడిస్తే..
ఆ వెలుగులు రెట్టింపు అవుతాయి.
పట్టు, వెల్వెట్, ఎంబ్రాయిడరీ దుపట్టా చీర మీదకు ధరించినా,
డ్రేపింగ్‌లో జత చేసినా ఆ స్టైల్ హుందాగా కనిపిస్తుంది.
ఈ వింటర్ సీజన్‌కి ప్రత్యేకంగా ఉండటమే కాదు చలి నుంచి రక్షణను కూడా ఇస్తుంది.
ఎవర్‌గ్రీన్‌గా ఉండే శారీ కట్టుకి
మహారాణి కళను తెచ్చే దుపట్టా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది.

# డబుల్ అట్రాక్షన్

### కాంట్రాస్ట్

శారీ కలర్, దుపట్టా కలరా పూర్తి కాంట్రాస్ట్ ఉన్నది ఎంచుకోవాలి. దీనివల్ల రెండూ భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.











### రంగు ఒకటే... డిజైన్ వేరు

సేమ్ కలర్ శారీ దుపట్టాను ఎంచుకున్నా ఎంబ్రాయిడరీ డిజైన్‌లో కాంబినేషన్స్ చూసుకోవాలి. చీర డిజైన్ హెవీగా ఉంటే, దుపట్టా డిజైన్ బ్రైట్‌గా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. పట్టు శారీ మీదకు డిజైనర్ దుపట్టాను ఎంచుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

### శాలువా స్టైల్

చీర మీదకు దుపట్టాను శాలువా మాదిరి కప్పుకున్నా ఈ సీజన్‌కి వెచ్చగా, బ్రైట్‌గా ఉంటుంది. అయితే, దుపట్టా గ్రాండ్‌గా ఉన్నది ఎంచుకోవాలి. ఇందుకు పట్టు, బ్రొకేడ్, ఎంబ్రాయిడరీ దుపట్టాలను చీరలను ఎంపికను బట్టి తీసుకోవాలి.

### డ్రేపింగ్ దుపట్టా

చీరకట్టులో భాగంగా దుపట్టాను జత చేర్చి కట్టడం ఒక స్టైల్. ఈ కట్టును నిపుణుల ఆధ్వర్యంలో సెట్ చేయించుకోవాలి. ఈ కట్టుకు కూడా కాంట్రాస్ట్ కలర్స్ ఉండేలా చూసుకోవాలి.

* ధైర్యం

# వ్యసనాల నుంచి వెలుగులోకి

పట్నాలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాఖీ శర్మ ఆ ఉద్యోగాన్ని వదిలేసి భర్త నడుపుతున్న రీహాబిలిటేషన్ సెంటర్‌ను తను స్వయంగా నిర్వహించడం మొదలుపెట్టింది. 5 వేల మంది ఇరవై ఏళ్ల లోపు పిల్లలను డ్రగ్స్ బారి నుంచి విముక్తి పొందేలా చేసింది. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్స్ ఇస్తోంది. మహిళలు వ్యసనానికి ఎలా లోనవుతున్నారు, వారు ఆ వ్యసనాల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై పని చేస్తున్నాను' అని వివరిస్తోంది రాఖీ. వ్యసనాలకు గురైన వారు వాటినుంచి బయటపడి తిరిగి సంతోషకరమైన జీవనాన్ని పొందేందుకు ఆమె చేస్తున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం కీలక అంశాలు.

''ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చింది. విషయం విని చాలా బాధ అనిపించింది. ఒక మహిళ బ్లేడ్‌తో ఒళ్లంతా కోసుకుంది. డ్రగ్స్ కారణంగా ఆమె వైవాహిక జీవితం దెబ్బతింది. మత్తు పదార్థాల నుంచి ఎలా బయటపడాలో ఆమెకు అర్థం కావడం లేదు. మహిళలు డీ–అడిక్షన్ సెంటర్లకు వెళ్లడం అనేది ఉందా.. అని నన్ను అడిగారు. మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వ్యక్తులు తమ అలవాటును వదిలించుకోవడానికి సహాయం చేయడం కూడా ఒక ముఖ్యమైన పని. నా మౌనం–పని ఈ రెండింటితో ఈ సెంటర్‌ను 22 ఏళ్లుగా నడుపుతున్నాను. వేలాదిమందిని మాదకద్రవ్య వ్యసనం బారి నుంచి బయటికి తీసుకువచ్చాను. ఒకప్పుడు తమ జీవితాలు అంధకారంలో ఉండి, అన్ని వైపులా నిరాశకు గురైన వారు ఇప్పుడు వారి కుటుంబాలతో జీవిస్తున్నందుకు సంతోషపడుతున్నాను.



రాఖీ శర్మ

**బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి..**

పుట్టి పెరిగింది గురుగ్రామ్. కొన్నాళ్లు ఢిల్లీలోనే ఉన్నాను. జంషెడ్‌పూర్, కోల్‌కతాలలో చదువుకున్నాను. డాక్టర్ కావాలనుకున్నాను కాని బ్యాంక్ ఉద్యోగి అయిన నాన్న కోరిక మేరకు సీఏ చదివాను. పెళ్లయ్యాక పట్నా వచ్చాను. నేనూ బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాను. కానీ కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఏకకాలంలో నిర్వహించడం అంత సులభం కాదని కొన్ని రోజుల్లోనే అర్థమయ్యింది. అప్పటికే మా వారు డీ–అడిక్షన్ సెంటర్ నడుపుతున్నారు. కొన్నిరోజులు గమనించిన తర్వాత, బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేశాను. నిజానికి డీ–అడిక్షన్ సెంటర్ ఎలా పనిచేస్తుంది, మత్తు పదార్థాల నుంచి వ్యసనపరులను ఎలా బయట పడేయాలో ఏమాత్రం తెలియదు. కానీ క్రమంగా నేర్చుకున్నాను.

**కాల్చివేస్తానని బెదిరింపులు..**

బీహార్‌లో డీ–అడిక్షన్ సెంటర్ నడపడం చాలా కష్టం. మాదకద్రవ్యాల వ్యసనాన్ని వదిలించుకోవడానికి ఎక్కువగా నేర నేపథ్యం ఉన్న వారు వస్తారు. మంచి కుటుంబాలకు చెందిన పిల్లలు డ్రగ్స్‌కు బానిసలైతే పరువు పోతుందనే భయంతో వారిని బీహార్ నుంచి వేరే చోటకు పంపేవారు. ఇక ఓల్డ్‌సిటీలో డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చిన వారిని నిలువరించడం పెద్ద సవాలుగా ఉండేది. అలాంటి వాళ్లు మా కేంద్రానికి వచ్చి కొడతామంటూ ఉద్రేకంతో వస్తుంటారు. ఆ సమయంలో వారిపై వారికి అదుపు ఉండదు. వారి అలవాట్లను అడ్డుకుంటే బెదిరింపులు ఉండేవి. 'బయటకు వెళ్లాక చూడు.. నిన్ను కాల్చేస్తాము'నేవారు. కేంద్రాన్ని మూసివేస్తామని బెదిరింపులు. కానీ నేనేం తప్పు చేయట్లేదు. భయమెందుకు?

**జైలులో డ్రగ్స్ నుంచి మహిళా ఖైదీల వరకు...**

పట్నాలోని బ్యూర్ జైల్లో ఖైదీల కోసం 10 ఏళ్లపాటు డీ–అడిక్షన్ క్యాంప్ నడిపాను. మహిళాఖైదీలతో ఈ క్యాంప్ స్టార్ట్ అయ్యింది. జైలులో ఓ బాలిక తన బట్టలు చింపుకుని బీభత్సం సృష్టించింది. అప్పుడు నన్ను పిలిచారు. ఆమెను చూడగానే ఆ అమ్మాయి డ్రగ్ అడిక్ట్ అని అర్థమైంది. తనకు డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో ఆమె అలా ప్రవర్తించింది. అప్పుడు ఇక్కడ ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో జైలు ఐజీకి నివేదించాను. ఐజీ అభ్యర్థన మేరకు జైలులో మూడు రోజుల పాటు డీ–అడిక్షన్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 1000 మందికి పైగా ఖైదీలు పాల్గొన్నారు. వందలాది మంది ఖైదీలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

వీధి బాలలు, అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. అలాంటి పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించాం. వీధి బాలల కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం. 30–35 మంది పిల్లలకు భోజనం, పానీయం, విద్య అన్ని ఏర్పాట్లు ఉన్న చోట ఈ కేంద్రానికి వసతి కల్పించే సామర్థ్యం కల్పించాం.



**నిషేధం తర్వాత..**

ఒక డ్రగ్ మానేస్తే మరో మందు వాడటం మొదలు పెడతారు. బీహార్‌లో మద్య నిషేధం తర్వాత ఈ ట్రెండ్ కనిపించింది. ఇప్పుడు ప్రజలు గంజాయి, ఇతర డ్రగ్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు మద్యం కంటే వారి వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం. నిషేధం కారణంగా, ప్రజలు డీ–అడిక్షన్ సెంటర్‌లకు రావడం మానేశారు. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రుల్లో డీ–అడిక్షన్ కోసం 15 ప్రత్యేక పడకలను అందించేందుకు కృషి చేశాం. ఆ తర్వాత ఈ విషయంలో వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాం. 5 వేల మంది పిల్లలు మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందారు.

**మహిళల కోసం..**

చాలా మంది మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండానే డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు వస్తుంటారు. మహిళల కోసం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్ కూడా ఉంది. చాలా మంది మహిళలు తమ గుర్తింపును దాచుకుంటారు, కొందరు తమ కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇక్కడకు వస్తారు.

ఓ మహిళ భర్త దుబాయ్‌లో ఉన్నాడు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం తెచ్చేవాడు. ఆమె తన బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యం సేవించి క్రమంగా దానికి బానిసయ్యింది. పట్టించుకునేవారెవరూ లేకపోవడంతో ఆమె బిడ్డ చదువుకు దూరమయ్యాడు. దాంతో డీ–అడిక్షన్ సెంటర్‌కి వెళ్లి, కొన్ని సెషన్స్ తర్వాత నార్మల్‌గా మారింది.

అదేవిధంగా పట్నాలోని ఓ ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ డ్రగ్స్‌కు బానిసైంది. ఆమె ఎంబీఏ చేసింది. తల్లి చైనాలో, సోదరుడు అమెరికాలో ఉన్నారు. ఆమె వైవాహిక జీవితం బాగోలేదు. విడాకుల తర్వాత ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. డీ–అడిక్షన్ సెంటర్‌కు వచ్చేటప్పటికి ఆమె శరీరంపై చాలా కోతలు ఉన్నాయి. బ్లేడుతో తానే కోసుకుని ఆనందించేది. కొన్నినెలల చికిత్స తర్వాత ఆమె సాధారణ స్థితికి వచ్చింది.

బీహార్‌కు చెందిన ఓ ఐఏఎస్ అధికారి మద్యానికి బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నాడు. భార్య ప్రోద్బలంతో ఆ ఐఏఎస్ డీ–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స తర్వాత తన వ్యసనాన్ని విడిచిపెట్టాడు. చాలా మంది డాక్టర్లు, ఇంజనీర్లు డీఅడిక్షన్ సెంటర్ కు వచ్చి డ్రగ్స్ అలవాటు నుండి విముక్తి పొందారు.'' అంటూ తను చేస్తున్న సేవ గురించి వివరించే రాఖీశర్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వంటిల్లు

బఠాణితో బ్రేక్‌ఫాస్ట్...
క్యాబేజ్‌కి ఎగ్‌తో దోస్తీ... పప్పులోకి చిక్కుళ్లు.
ఊహకందని అరటికారం...
మన వంటింటి చమత్కారం

# కూరలు అవే రుచులే వేరు

## అరటి కాయ కారం పొడి



**కావలసినవి:** అరటికాయలు – మూడు; పసుపు – 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; మినప్పప్పు – రెండు టీ స్పూన్లు; పచ్చిశనగ పప్పు – టీస్పూను; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి – ఐదు; మిరియాలు – టీస్పూను; ఎండు కొబ్బరి తురుము – నాలుగు టీస్పూన్లు; కరివేపాకు – ఐదు రెమ్మలు; ఇంగువ – చిటికెడు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఆవాలు – అరటీస్పూను.

**తయారీ:** స్టవ్ వెలిగించి మీడియం మంట మీద అరటికాయలను కాల్చాలి. ● చక్కగా కాలాక మంట మీద నుంచి తీసి చల్లారాక తొక్కతీసేసి, సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలిపెట్టి టీస్పూను మినప్పప్పు, పచ్చి శనగపప్పు, ధనియాలు, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి తురుము, మూడు రెమ్మల కరివేపాకు, ఇంగువ వేసి దోరగా వేగాక, చల్లారనిచ్చి పొడిచేసి పెట్టుకోవాలి. ●స్టవ్ మీద బాణలిపెట్టి నూనె వేయాలి. ● వేడెక్కిన తరువాత మిగిలిన మినప్పప్పు, ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ● చిటపటలాడాక అరటికాయ తురుము, పసుపు, రుచికి సరిపడా ఉప్పువేసి వేయించాలి. ● తరువాత మసాలా పొడి వేసి కలిపి మూతపెట్టి, సన్న మంట మీద ఐదు నిమిషాలు మగ్గనిస్తే అరటి కాయ పొడి రెడీ.

## క్యాబేజ్ ఎగ్ భుర్జి



**కావలసినవి:** క్యాబేజీ తురుము – రెండు కప్పులు; నూనె – మూడు టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; పచ్చిమిర్చి – చిన్నవి ఆరు(సన్నగా తరగాలి); ధనియాల పొడి – అరటీస్పూను; పసుపు – అరటీస్పూను; కారం – ముప్పావు టీస్పూను; గుడ్లు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

**తయారీ:** స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ తరుగు వేసి వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక, అల్లం వెల్లుల్లి పేస్టువేసి వేయించాలి. ● అల్లం వెల్లుల్లి పేస్టు పచ్చివాసన పోయిన తరువాత పచ్చిమిర్చి తరుగు వేయాలి. ● మిర్చి వేగిన తరువాత ధనియాలపొడి, కారం, పసుపు, క్యాబేజీ తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి బాణలి మీద మూతపెట్టి సన్న మంట మీద మగ్గనివ్వాలి. ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీటర్ లేదా ఫోర్క్‌తో కలిపి పక్కన పెట్టాలి. ● క్యాబేజీ ఉడికి దగ్గర పడుతున్నప్పుడు గుడ్ల సొనవేసి కలుపుతూ వేయించాలి. ● చక్కగా వేగిన తర్వాత కొత్తిమీర చల్లుకుని దించేయాలి. ● రోస్టెడ్ బ్రెడ్, చపాతీ, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

## గ్రీన్ పీస్ ఊతప్పం



**కావలసినవి:** పచ్చిబఠాణి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; బియ్యప్పిండి – మూడు టీస్పూన్లు; పచ్చిమిర్చి – మూడు; అల్లం – అరంగుళం ముక్క; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు; జీలకర్ర – టీస్పూను; పెరుగు – అరకప్పు; వంటసోడా– 1/2 టీ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – ఊతప్పం కాల్చడానికి తగినంత.

**తయారీ:** మిక్సీజార్‌లో పచ్చిబఠాణి, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి తగినంత నీటిని వేస్తూ గ్రైండ్ చేయాలి. ● ఇప్పుడు ఒక పెద్ద గిన్నె తీసుకుని సూజీ రవ్వ, బియ్యప్పిండి, గ్రైండ్ చేసిన బఠాణి పేస్టు, పెరుగు కలిపి నానబెట్టాలి. ● అర గంట తరువాత రుచికి సరిపడా ఉప్పు, వంటసోడా, కొద్దిగా నీళ్లు పోసుకొని గరిట జారుడుగా కలుపుకోవాలి. ● పెనం వేడెక్కాక కొద్దిగా నూనె వేసి రెండు గరిటలు పిండి వేసి రొట్టెలా వేసుకోవాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, క్యారట్, క్యాప్సికమ్ ముక్కలు వేసి మూత పెట్టి మంట తగ్గించాలి. ● ఓ నిమిషం తర్వాత మూత తీసి ఊతప్పాన్ని తిరగేసి మరో అర స్పూన్ నూనె వేసి రెండోవైపు కూడా కాల్చుకుంటే గ్రీన్‌పీస్ ఊతప్పం రెడీ. చట్నీ, సాంబార్‌తో చాలా బావుంటుంది.

## చిక్కుడు కాయ పప్పు



**కావలసినవి:** చిక్కుడు కాయలు – పావు కేజీ; పెసరపప్పు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; పచ్చి కొబ్బరి తురుము – అరకప్పు; ఎండుమిర్చి – నాలుగు; జీలకర్ర – టీస్పూను; కరివేపాకు – నాలుగు రెమ్మలు; ఆవాలు – పావు టీస్పూను; నూనె – తగినంత; మినప్పప్పు – టీస్పూను; ఉప్పు – తగినంత.

**తయారీ:** పెసరపప్పుని కడిగి కుకర్ గిన్నెలో వేయాలి. ● దీనిలో కప్పునీళ్లు, పసుపు, 1/2 టీస్పూను ఉప్పు వేసి మూతపెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ● చిక్కుడు కాయలను కడిగి ఈనె తీసి ముక్కలు చేసుకోవాలి. ● తగినన్ని నీళ్లు, చిటికెడు ఉప్పు వేసి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పచ్చికొబ్బరి, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిని మిక్సీ జార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి పేస్టు చేయాలి. ● ఉడికిన పెసరపప్పులో.. చిక్కుడు ముక్కలు, నూరుకున్న మసాలా పేస్టు, ఉప్పువేసి కలపాలి. ● ఒక పాత్రలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఆవాలు, మినప్పప్పు వేసి చిటపటలాడాక మిగతా కరివేపాకు వేసి వేయించి అందులో పప్పు మిశ్రమాన్ని కలిపితే చిక్కుడుకాయ పప్పు రెడీ. అన్నం, చపాతీ, రోటీల్లోకి చాలా బావుంటుంది.